క్లుప్తంగా

రేపు డయల్ యువర్ డీఎం

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ యు.రామన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు, వారి సలహాలు తీసుకోవడానికి ఆ రోజు సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రయాణికులు 99592 25533 నంబర్‌కు కాల్ చేసి సమస్యలు తెలియజేయాలని కోరారు.

విద్యా కానుక కిట్ల పరిశీలన

మధురపూడి: ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ గౌరీ శంకర్ అన్నారు. ఆయన సోమవారం కోరుకొండ హైస్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన యూనిఫాం, షూస్ ధరించి, ప్రతిరోజూ స్కూలుకు రావాలన్నారు. పాఠశాలలో పారిశుధ్యం, వసతులు, మధ్యాహ్నం భోజనం అమలు తీరును పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ కుశలవదొర, ఇన్‌చార్జి హెచ్‌ఎం బీవీఎల్‌వీఎన్ ఆనందబాబు ఉన్నారు.

రేపు వైఎస్సార్ సీపీ గూటికి రామసతీష్

అనపర్తి: మండలంలోని దుప్పలపూడికి చెందిన టీడీపీ నాయకుడు వల్లభశెట్టి రామసతీష్ టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ నెల 28న గ్రామంలోని టీఆర్‌ఆర్ కన్వెన్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో సతీష్ తన అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు చెప్పారు.

స్పందనకు రెండు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రెండు అర్జీలు వచ్చాయని ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. భూతగాదాల విషయంలో పురుషోత్తపట్నానికి చెందిన గెడ్డం సోమరాజు, అలాగే కూనవరానికి చెందిన బూసి సరస్వతి అర్జీలు అందించారన్నారు.

రంగంపేటకు చేరుకున్న పోరుయాత్ర

రంగంపేట: సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు చేపట్టిన పోరుయాత్ర సోమవారం రంగంపేట చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ మాణిక్యాంబ, కె.బేబీరాణిలు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇస్తానన్న హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, వేతనంతో కూడిన మెటర్నరీ లీవ్ తదితర డిమాండ్లను నెరవేర్చాలన్నారు.

ఏసు బోధనలు అనుసరణీయం

మధురపూడి: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని రెవరెండ్ ఫాదర్ మనోజ్ కుమార్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉపదేశి కొల్లి యాకోబు, సంఘ పెద్దలు కాతేటి ఇందిర, కొల్లి శ్యామల, గెడ్డం రత్నం, దూళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలి

రంగంపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు వెంటనే పాఠ్యపుస్తకాలు అందించాలని మండల ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు కె.నాని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. అనంతరం నాని మాట్లాడుతూ సకాలంలో పాఠ్యపుస్తకాలు అందక విద్యార్థులు చదువులో వెనుకబడిపోతున్నారన్నారు. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం తగ్గిపోతోందన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లోని అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు వీరబాబు

గోకవరం: మనబడి నాడు–నేడు పథకంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం పీఎంసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పీఎంసీ చైర్మన్ కణితి శ్రీనివాస్, హెచ్‌ఎం పల్లాల సత్యనారాయణరెడ్డి, నాయకులు నరాలశెట్టి నర్శయ్య, తోలేటి రాంప్రసాద్, కార్యదర్శి టంకాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో ఆరోగ్యానికి ముప్పు

- అవగాహన కల్పించిన వక్తలు
- పలుచోట్ల అవగాహన ర్యాలీలు



సీతానగరం డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్‌ఈబీ సీఐ సత్యనారాయణ



రంగంపేట మెయిన్ రోడ్డు సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో సీఐ శ్రీనివాస్ తదితరులు



కోరుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

రంగంపేట: మాదక ద్రవ్యాలు ఆరోగ్యానికి పెను ముప్పు కలుగుతుందని సెబ్ సీఐ జి.వెంకటలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రమైన రంగంపేట మెయిన్ రోడ్డు సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటలక్ష్మి మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడడం వల్ల ఏటా వేల సంఖ్యలో మత్యువాత పడుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలు వాడటం నేటి యువతకు ఫ్యాషన్‌గా మారిందని, తమ బంగారు భవిష్యత్‌ను చేజేతులా పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మాదకద్రవ్యాలు తీసుకోమంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రంగంపేట మెయిన్‌రోడ్డు సెంటర్‌లో ఏడీబీ రోడ్డుపై మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

అనపర్తి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ వి.శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక జీబీఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ మత్తు పదార్థాలతో యువత భవిత దుర్భరంగా మారుతుందన్నారు. మత్తు పదార్థాల వాడకం వల్ల శారీరక, మానసిక సమస్యలతో పాటు శరీర అవయవాలు దెబ్బతింటాయని చెప్పారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.అప్పారావు, ఏఎస్ఐ వీర్రాజు, రంగంపేట ఎస్‌ఈబీ ఎస్ఐ కె.శేఖర్‌బాబు, ఎం.బాబూరావు, జీబీఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎన్‌వీ అబ్బాయిరెడ్డి, పీఆర్‌ఎల్ స్వామి పాల్గొన్నారు.

బిక్కవోలు: మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బిక్కవోలులో బిక్కవోలు పోలీసులు, శ్రీప్రజ్ఞా కళాశాల విద్యార్థులు కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బిక్కవోలు వంతెన వద్ద మానవహారం నిర్వహించి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి.బుజ్జిబాబు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, బిక్కవోలు, రంగంపేట ఎస్ఐలు కె.శేఖర్‌బాబు, జి.వెంకటలక్ష్మి, ప్రజ్ఞా కళాశాల కరస్పాండెంట్ ఓదూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు

సీతానగరం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, వాటితో అనేక అనర్థాలు జరుగుతాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జి.సత్యనారాయణ అన్నారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎస్‌ఈబీ సీఐ సత్యనారాయణ, పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్సై వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సీతానగరం ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, ఏఎస్సై సమర్పణ రావు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు

కోరుకొండలో..

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండలో ట్రైనీ ఏఎస్పీ పంకజ్ మీనన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగాన్ని కట్టడిచేద్దాం, రేపటి సమాజాన్ని కాపాడదామని పిలుపునిచ్చారు. స్థానిక శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నుంచి మార్కెట్ రోడ్డు, బస్టాండ్ మీదుగా మెయిన్‌రోడ్డు వరకూ ర్యాలీ జరిగింది. కోరుకొండ హైస్కూల్, జూనియర్ కాలేజీలకు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై కట్టా శారదా సతీష్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మూగజీవాల పట్టివేత



వ్యాన్‌లో తరలిస్తున్న ఆవులు, గిత్త దూడలు

అనపర్తి: తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న మూగజీవాలను అనపర్తి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్ఐ పి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పులుగుర్త వద్ద రోడ్డు పక్కనే ఉన్న బోదెలో హైదరాబాద్ వెళుతున్న ఓ వ్యాన్ చక్రాలు కూరుకుపోయాయి. వ్యాన్‌లో ఆవులు ఉన్నట్లుగా స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వ్యాన్‌ను తనిఖీ చేశారు. వ్యాన్‌లో సుమారు 40 ఆవులు, గిత్త దూడల్ని ఇరికించి ఎక్కించేయడంతో ఒకదానిపై మరొకటి పడి అప్పటికే 10 మూగజీవాలు మృతి చెందాయి. దీంతో వ్యాన్ డ్రైవర్ సంతోష్‌ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. తన యజమాని సూచనల మేరకు కాకినాడ జిల్లా జగ్గంపేట పరిధిలో సుమారు 40 ఆవుల్ని, గిత్త దూడల్ని వ్యాన్‌లో ఎక్కించుకుని హనుమాన్ జంక్షన్ వెళుతున్నట్లు డ్రైవర్ సంతోష్ చెప్పినట్లుగా తెలుస్తుంది. చనిపోయిన మూగజీవాలకు పోస్టుమార్టం చేయించాల్సి ఉందని, మిగిలిన సుమారు 30 ఆవులు, గిత్త దూడలను రాజానగరం మండలం ముక్కినాడ పరిధిలోని బీడు భూమి వద్దకు చేర్చి వాటికి రక్షణ కల్పించామని ఎస్ఐ అప్పారావు తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కాపవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



కాపవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కాపవరం గ్రామంలో ఆయన సోమవారం మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాల వివరాలను తెలియజేసి, వారికి బుక్‌లెట్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటా ఆనందం నింపాలనే ఉద్దేశంతో నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని చెప్పారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ ఎం.భీష్ముడు, కర్రి గంగరాజు, మాజీ ఎంపీటీసీ నిడదవోలు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి పోతుల ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, మండల సచివాలయ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో దళితులకు సముచిత స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఏడుకొండలు

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దళితులకు సముచిత స్థానం లభిస్తోందని ఆ పార్టీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు అన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జిగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, రీజినల్ కోఆర్డినేటర్లు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీ వంగా గీత, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షులు కురసాల కన్నబాబు, జక్కంపూడి రాజాలకు కృతజ్ఞతలు తెలిపారు. జోన్‌లోని ఐదు జిల్లాల్లో పార్టీ దళిత విభాగాలను సమన్వయం చేసుకుని రానున్న ఎన్నికల్లో పార్టీ తిరిగి అధికారం చేపట్టడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో దళిత నాయకులు మచ్చా మోహన్, గునిపే ఏడుకొండలు, ఇజ్జిన కిరణ్‌కుమార్, కూరాకుల సుమంగళి, మడతల రమేష్, గోలి చిన్ని, పత్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

పెదపూడి: భూముల రీసర్వే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. ఏపీ త్రయం గ్రామంలో వీఆర్వోలు, ఇతర అధికారులు నిర్వహిస్తున్న రీసర్వే బృందాల ప్రక్రియను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేతో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలకు చక్కటి పరిష్కారం లభిస్తుందన్నారు. రీసర్వేతో భూముల వివరాలు కచ్చితంగా తెలుస్తాయన్నారు. గ్రామాల్లో రీసర్వే చేసే ముందుగా రైతులకు సమాచారం, నోటీసులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు గొల్లపల్లి అంజిబాబు, కరెడ్ల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

రంగంపేట: ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ కళాశాలలో సోమవారం పేరెంట్స్–టీచర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు బాగుండాలంటే ప్రభుత్వంతో పాటు అధ్యాపకులకు, తల్లిదండ్రులకు బాధ్యత ఉండాలన్నారు. పేదింటి పిల్లలందరూ అంతర్జాతీయంగా ఎదగాలన్న ఉద్దేశంతో మూడో తరగతి నుంచే విద్యార్థులను టోఫెల్ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేయనుందన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ ఎల్.శ్రీనివాసరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పేపకాయల వెంకన్న, మెంబర్లు గాలింక పార్వతి, ఇజ్జిన కుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

దోసకాయలపల్లి అభివృద్ధికి రూ.7.12 కోట్లు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా గడప గడపకూ మన ప్రభుత్వం



దోసకాయలపల్లిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లి అభివృద్ధికి రూ.7.12 కోట్లు కేటాయించినట్టు, మరింత అభివృద్ధికి నిరంతరాయంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆ గ్రామంలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకూ సుమారు 300 గడపలు తిరిగారు. ఆయనకు అక్కచెల్లెమ్మలు హారతులతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం మెరుగుదల, పర్యావరణం పరిరక్షణకు జగన్ ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఇంటి వద్దకే వైద్యం అందించడం ద్వారా ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారని, ఆర్‌బీకేలు ఏర్పాటుచేయడం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించడం జరుగుతోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. గ్రామంలోని సవర సామాజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే శ్రీరంగపట్నం, జంబూపట్నంలో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్యసూర్యకుమారి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సర్రాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసి, మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, శ్రీరంగపట్నం సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, జంబూపట్నం సర్పంచ్ ఉల్లి అప్పన్న దొర, నాయకులు కంటే వినయ్ తేజ, మద్దాల రమణ, కడవల శివ, ఓపెన్ జిమ్‌ల కాంట్రాక్టర్ సతీష్, వ్యవసాయశాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, సచివాలయం సెక్రటరీలు జాకబ్ రాజు, జానా శ్రీను, సురేష్‌బాబు పాల్గొన్నారు. కాగా.. మంగళవారం కూడా దోసకాయలపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతుంది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే..



జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్

పెదపూడి: అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం అమలు చేస్తుందని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ అన్నారు. జి.మామిడాడలో జరుగుతున్న జగనన్న సురక్ష పథకంలో భాగంగా సమస్యల గుర్తింపు కార్యక్రమాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించి సచివాలయాల ద్వారా మంజూరయ్యే 11 ధ్రువపత్రాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు. ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

కంబాలచెరువు: లింగనిర్ధారణ పరీక్షలు చేసిన వారూ, చేయాలని కోరిన వారూ శిక్షార్హులేనని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రాజకుమారి అన్నారు. స్థానిక ఆనం కళాకేంద్రంలోని మినీ మీటింగ్ హాల్లో సోమవారం పీసీపీఎన్‌డీటీ చట్టంపై రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమన్నారు. డాక్టర్ శ్రీవల్లి మాట్లాడుతూ మహిళ సమాఖ్య సమావేశాల్లో వైద్య సిబ్బంది పాల్గొని అందులో ఒక అంశంగా పీసీపీఎన్‌డీటీ చట్టం, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం గురించి చర్చించాలన్నారు. సమావేశం అనంతరం ఫొటోలను జిల్లాకు పంపించాలన్నారు.

ఆర్టీసీ టికెట్లపై పదిశాతం రాయితీ

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ బస్సుల్లో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రాకపోకలకు ఒకేసారి రిజర్వేషన్ టిక్కెట్లు కొనుగోలు చేస్తే పదిశాతం రాయితీ ఇవ్వనున్నట్లు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఈ రాయితీ రాజమహేంద్రవరం డిపో నుంచి నడుస్తున్న సర్వీసులకు వర్తిస్తుందన్నారు. రాజమహేంద్రవరం – హైదరాబాద్ (బీహెచ్‌ఈఎల్), రాజమహేంద్రవరం – హైదరాబాద్ (జీడిమెట్ల), శ్రీశైలం, గుంటూరు, విజయవాడ (అల్ట్రా డీలక్స్) తిరుపతి, విశాఖపట్నం, విశాఖపట్నం (అల్ట్రా డీలక్స్), ఇచ్ఛాపురం (ఎక్స్‌ప్రెస్), భద్రాచలం (ఎక్స్‌ప్రెస్) వయా కుక్కునూరు, భద్రాచలం (వయా మారేడుమిల్లి) బస్సులకు వర్తిస్తుందన్నారు. దీన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తల్లి చెంతకు సురక్షితంగా బాలుడు



బాలుడిని తల్లికి అప్పగించిన జీఆర్పీ పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: రైలులో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న బాలుడిని గుర్తించి, సురక్షితంగా అతడి తల్లికి అప్పగించినట్లు జీఆర్పీ ఎస్ఐ మావుళ్లు సోమవారం తెలిపారు. అనపర్తి మండలం కొంకుదురుకు చెందిన ఏడేళ్ల రాయుడు అనిల్ తల్లి హైదరాబాద్‌కు కూలి పనికి వెళ్లింది. దీంతో గ్రామంలో అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం అమ్మమ్మ మందలించడంతో అనపర్తిలో గౌతమీ ఎక్స్‌ప్రెస్ ఎక్కేశాడు. రైలులో ఆ బాలుడిని గుర్తించిన ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన జీఆర్పీ పోలీసులు రైల్లోని బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. సోమవారం తల్లిని రప్పించి సురక్షితంగా అప్పగించారు.

అమ్మఒడితో చదువుకు ఆర్థిక ఆసరా



వీరభద్రపురం పాఠశాలలో మాట్లాడుతున్న డీఐ దిలీప్‌కుమార్

కంబాలచెరువు: తల్లిదండ్రులు తమ పిల్లల చదువు విషయంలో ఆర్థికంగా ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నారని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక వీరభద్రపురం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో సోమవారం తల్లిదండ్రుల కమిటీతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఐ దిలీప్ కుమార్ మాట్లాడుతూ బుధవారం తల్లుల ఖాతాల్లో జమచేయనున్న అమ్మఒడికి సంబంధించిన ముఖ్యమంత్రి సందేశాన్ని తల్లిదండ్రులకు టీవీ ద్వారా వినిపించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొండ్రేటి నరేష్, ఉపాధ్యాయులు శివాజీ తమ సొంత ఖర్చుతో సమకూర్చిన నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, ఎరెజర్లను ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు డీఐ దిలీప్ కుమార్ పంపిణీ చేశారు. వీరభద్రపురం ప్రాథమిక పాఠశాలలో ప్రతి నెలా నూరుశాతం హాజరైన విద్యార్థికి ఒక మెడల్ అందజేస్తున్నామని ప్రధానోపాధ్యాయులు నరేష్ తెలిపారు.

ప్రగతి పథంలో ప్రభుత్వ పాఠశాలలు

ముఖ్యమంత్రి జగన్ తీసుకుంటున్న ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలలన్నీ ప్రగతి పథంలో నడుస్తున్నాయని నాగరాజా నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోటూరి మంగారాణి అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి సోమవారం పేరెంట్స్ కమిటీతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అమ్మఒడికి సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సందేశాన్ని తల్లిదండ్రులకు వీడియో రూపంలో వినిపించారు. పేరెంట్ కమిటీ చైర్ పర్సన్ జి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు లబ్ధి

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. హుకుంపేట గ్రామ సచివాలయం–1 పరిధిలో జగనన్న సురక్ష గృహ సందర్శన కార్యక్రమాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిజిటల్ అసిస్టెంట్లు లబ్ధిదారుల వివరాలను ఎలా కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారో పరిశీలించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ వలంటీర్లు తమ పరిధిలోని ప్రతి గృహాన్ని సందర్శించి ప్రభుత్వపరంగా, ఇంకా అందాల్సిన పథకాల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామసభ నిర్వహించే తేదీని ముందుగా తెలియజేసి, వారికి ఆరోజు లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలు ఉచితంగా అందించనున్నట్లు వివరించారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి సరకులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: స్థానిక కుమ్మరిపేటలో వర్షానికి తాటాకిల్లు నేలకూలి నిరాశ్రయులైన కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు చేయూతనందించారు. సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, సచివాలయ మండల కన్వీనర్ రమేష్ బాధితురాలు నీలిమ లక్ష్మికి బియ్యం, కందిపప్పు అందించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి టంకాల శ్రీనివాసరావు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, తోలేటి రాంప్రసాద్, యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.